

అన్ని విధాలా భద్రత కల్పించాలి

నిత్యం వందలాది మంది ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. పగలు, రాత్రి వేళల్లో మహిళ డాక్టర్లతోపాటు హెల్త్ వర్కర్లంతా ఈ సేవల్లో భాగస్వాములు అవుతున్నారు. డ్యూటీ సమయంలో స్వేచ్ఛగా పనిచేసుకునేలా భద్రత కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపైన ఉంది. యూపీహెచ్‌సీల్లో రాత్రి పూట వైద్య సేవల అవసరం ఉన్నవారు మినహా ఎవరు లోపలికి రాకుండా భద్రత కల్పించాలి. సమస్యాత్మక ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల బయట సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యులకు ప్రత్యేకంగా రెస్ట్‌రూమ్‌లు అందుబాటులోకి తేవాలి.

– పార్వతి, హెల్త్ వర్కర్, ఎంవీపీ కాలనీ





కఠిన చట్టం తీసుకురావాలి

డాక్టర్లు, వైద్య సిబ్బంది నిత్యం ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో విభిన్నమైన పరిస్థితుల మధ్య పనిచేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా మహిళా డాక్టర్లు, సిబ్బందిలో ఒత్తిడి అధికం. నైట్ డ్యూటీ సమయంలో ఇద్దరు మహిళలకు కలిపి విధులు అప్పగించడంతోపాటు సెక్యూరిటీని పెంచాలి. కోల్‌కతాలో జరిగిన సంఘటనలు పునారావృతం కాకుండా ఉండాలంటే ప్రత్యేకమైన భద్రతా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముంది. దోషులను కఠినంగా శిక్షించేలా ప్రత్యేక చట్టం అందుబాటులోకి తేవాలి. అప్పుడే మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడాలంటే భయం ఉంటుంది.

– డాక్టర్ భవానీ, క్లినికల్ సైకాలజిస్ట్

క్లుప్తంగా

వర్షంతో ఉపశమనం



ఆరిలోవ బాలాజీనగర్‌లో కురుస్తున్న వర్షం

బీచ్‌రోడ్డు: ఆరిలోవ ప్రాంతంలో శుక్రవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి వాతావరణం కాస్త చల్లబడింది. రెండు రోజులుగా ఉక్కపోతతో సతమతమైన జనం ఉపశమనం పొందారు. చల్లని గాలి వీచడంతో ఆరిలోవ ప్రాంత వాసులు కాసేపు ఆస్వాదించారు. శనివారం ఉదయం, కాస్త విరామం తర్వాత మధ్యాహ్నం వర్షం కురవడంతో ఆరిలోవ కాలనీ మొదలు టి.ఐ.సి.పాయింట్, బాలాజీనగర్, తోటగరువు ప్రాంతాల్లో రోడ్లు తడిసిముద్దయ్యాయి. పలువురు వానలో తడుస్తూ వాహనాలపై రాకపోకలు సాగించారు.

నేలకొరిగిన వృక్షం



ఈస్ట్ పాయింట్ కాలనీ రహదారిపై కూలిన చెట్టు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 20వ వార్డు ఈస్ట్ పాయింట్ కాలనీలోని సాయిబాబా ఆలయం రహదారిపై భారీ చెట్టు కుప్పకూలింది. శనివారం ఉదయం కురిసిన వర్షం, ఈదురు గాలుల కారణంగా ఈ చెట్టు కూలినట్లు స్థానికులు తెలిపారు. రహదారిపై చెట్టు కూలిన సమయంలో వర్షం కారణంగా అటుగా రాకపోకలు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. పక్కనే కార్లు పార్క్‌చేసి ఉండటంతో వాటికి చిన్నపాటి డ్యామేజ్ జరిగింది. చెట్టు కూలడంతో ఆ రహదారిలో రాకపోకలకు, బాబా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు మధ్యాహ్నం జీవీఎంసీ సిబ్బంది అక్కడికి చేరుకుని చెట్టు కొమ్మలను ముక్కలుగా కట్‌చేసి తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

సింహగిరిపై సెల్‌ఫోన్ కౌంటర్‌లో అక్రమ వసూళ్లు

- ఏఈవో ఆకస్మిక తనిఖీల్లో బయటపడిన వైనం

సింహాచలం: సింహగిరిపై భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్‌లో దేవస్థానం అవుట్ సోర్సింగ్ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వైనం శనివారం ఆకస్మికంగా దేవస్థానం ఏఈవో చేసిన తనిఖీల్లో బయటపడింది. వివరాలిలోకి వెళ్తే.. భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచే కాంట్రాక్ట్‌ను చేయలేక కాంట్రాక్టర్ ఇటీవల విరమించుకున్నాడు. దాంతో దేవస్థానమే స్వయంగా తమ సిబ్బందిని కౌంటర్లలో నియమించి సెల్‌ఫోన్ భద్రపరిచే ఏర్పాటు చేసింది. కౌంటర్లలో ఒక్కో సెల్‌ఫోన్‌కి రూ.5 చొప్పున వసూలు చేయాల్సి ఉంది. ఈ తరుణంలోనే రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అధిక వసూళ్లకు పాల్పడుతున్నారన్న విషయం ఇటీవల చర్చాంశనీయమైంది. దీంతో శనివారం దేవస్థానం ఏఈవో పాలూరి నరసింగరావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జారీ చేసిన టికెట్లు కంటే రూ.960 నగదు మహిళా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వద్ద అధికంగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో రిపోర్టు తయారుచేసి దేవస్థానం ఈవో దృష్టికి తీసుకెళ్లారు.

శారదా పీఠంలో కృష్ణాష్టమి వేడుకలు రేపు



పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు పీఠం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి శ్రీకృష్ణుడికి అభిషేకాలు, పూజలు, గోపూజ, సాయంత్రం ఉట్టి సంబరాలు జరుగుతాయన్నారు. 12 ఏళ్లలోపు బాలబాలికలు చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలు అలరిస్తారని.. భక్తులంతా ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

చినుకు పడితే చిత్తడే..!



పశు సంవర్ధక శాఖ ఆస్పత్రి నుంచి హెచ్‌బీ కాలనీకి వెళ్లే రోడ్డులో బురద



ఇసుకతోట రహదారిలో యూజీడీ గోతులు

- నత్తనడకన భూగర్భ డ్రైనేజీ పనులు
- గోతులు తవ్వి వదిలేయడంతో రోడ్లు బురదమయం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు

మద్దిలపాలెం: నత్తనడకన సా...గుతున్న భూగర్భ డ్రైనేజీ పనులతో స్థానిక ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో మిగిలిపోయిన ప్రాంతాల్లో యూజీడీ పనులు కొన్నాళ్లుగా చేస్తూనే ఉన్నారు. కాలనీల అనుసంధానంగా ఉండే రోడ్ల మధ్యలో తవ్వకాలు జరిపి ఈ పనులు నిర్వహిస్తున్నారు. దీంతో కాలనీల వాసులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాలు కురుస్తుండటంతో రహదారుల గోతుల్లో బురద చేరి చిత్తడిగా మారుతున్నాయి. యూజీడీ పనుల నిమిత్తం రోడ్డు మధ్యలో తవ్వి సక్రమంగా పూడ్చకపోవడంతో పెద్ద గోతులతో నిండిపోయాయి. ఏమాత్రం చినుకు పడినా రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. ఈ సమయంలో రాకపోకలు సాగించడానికి నరకయాతన పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. వాహనాలు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నాయి. పాదచారులు కాలు తీసి వేయలేకపోతున్నారు.

రాకపోకలకు తంటాలు

ఇసుకతోటలోని పశు సంవర్ధక శాఖ ఆస్పత్రి నుంచి హెచ్‌బీ కాలనీ వైపు పాత వెంకోజీపాలెం మీదుగా ఉన్న రోడ్డులో రెండు నెలల కిందట భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టారు. రహదారిలో తవ్విన గోతులను సవ్యంగా పూడ్చలేదు. మట్టితో నిండిపోయిన ఆ రోడ్డు కాస్తా వర్షం పడితే చిత్తడి చిత్తడిగా మారుతోంది. వాహనాలు సైతం రాకపోకలు సాగించలేని విధంగా తయారైంది. రోడ్డు మధ్యలో గోతులు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. పాదచారులు నడవడానికి వీలు లేని పరిస్థితి ఏర్పడింది.

సకాలంలో పూర్తి చేయండి

భూగర్భ డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలని స్థానిక కాలనీల వాసులు కోరుతున్నారు. నెలలు గడుస్తున్నా.. నేటికీ పూర్తి చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. హెచ్‌బీ కాలనీ, ఇసుకతోట ప్రాంతాల్లో చేపట్టిన పనుల కారణంగా రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని పేర్కొంటున్నారు. వర్షాలు కురుస్తున్నందున్న వల్ల రోడ్లు బురదమయంగా తయారయ్యాయని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి వీలైనంత త్వరగా యూజీడీ పనులు ముగించాలని కోరుతున్నారు.

ఉన్నత విద్యా మండలి సదస్సులో ఏయూ అధికారులు



వర్చువల్ సదస్సులో పాల్గొన్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఉన్నత విద్యా మండలి వర్చువల్ విధానంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పాల్గొన్నారు. డిగ్రీ కోర్సులు, డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ తదితర అంశాలపై ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ ఆచార్య కె.రామమోహనరావు చర్చించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, కంప్యూటర్ సెంటర్ డీన్ ఆచార్య భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో స్వచ్ఛ భారత్



ఆర్ట్స్ కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సైతం స్వచ్ఛ భారత్‌కు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ విభాగాల్లో నిర్వహించాలని ఆదేశించారు. దీనిలో భాగంగా విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఆచార్యులు ఆర్ట్స్ కళాశాల పరిసరాల్లో వ్యర్థాలను తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య షారోన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛ భారత్‌ను నిరంతరం ప్రక్రియగా చేపడతామన్నారు. త్వరలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలీ, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఫార్మా' యాజమాన్యాన్ని తక్షణమే అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

బీచ్‌రోడ్డు: అనకాపల్లి జిల్లా ఎస్సైన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని, తక్షణమే వారిని అరెస్టు చేయాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17 మంది చావుకు కారణమైన కంపెనీ యాజమాన్యాన్ని ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే అరెస్టు చేయడం లేదని, ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని పరిశ్రమల భద్రతపై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని, తనిఖీలు నిర్వహించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా చర్యలు చేపట్టి ఆదుకోవాలని కోరారు. త్వరలోనే ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తామన్నారు. ఉత్తరాంధ్ర నాయకులు పాల్గొన్నారు.

చిన్నోడి పెద్ద మనసు

50 మంది విద్యార్థులకు రూ.6 లక్షల సాయమందించిన రోహన్ చెర్ల



పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందజేస్తున్న రోహన్ చెర్ల

దాబాగార్డెన్స్: ప్రతిభ ఉండి ఆర్థిక పరిస్థితుల కారణంగా విద్యకు దూరం అవుతుంటారు చాలా మంది పేద విద్యార్థులు. అటువంటి వారికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చాడు 17 ఏళ్ల రోహన్ చెర్ల. రోహన్ తాత వారణాసి సూర్యనారాయణ మూర్తి విశాఖ మహా నగరంలో గల ఏవీఎన్ కళాశాలలో ఇంగ్లీషు అధ్యాపకునిగా పని చేశారు. ఆయన జ్ఞాపకార్థం కళాశాలలో బాగా చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు రోహన్ చెర్ల ముందుకొచ్చాడు. ఈ మేరకు ఏవీఎన్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రోహన్ చెర్ల మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందిస్తూ, వారి చదువుకు ప్రోత్సాహం అందివ్వడమే ధ్యేయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ తాను చదువుకుంటూ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. సుమారు 50 మంది విద్యార్థులకు రూ.6 లక్షలు అందజేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జోసెఫ్ మార్షల్, సాయి హిరణ్మయి చెర్ల, రోహన్ కమత్, ఆకెళ్ల శైలజ, డాక్టర్ మహలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజనీ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నేడు కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. సాలూరుకు చెందిన పూర్ణిమ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఆచరణాత్మక జ్ఞానంతో అద్భుత ఫలితాలు



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణమూర్తి

మురళీనగర్: ఆచరణాత్మక జ్ఞానంతోనే అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్ ఆర్జేడీ జె.సత్యనారాయణమూర్తి అన్నారు. ఏపీసీటీఈ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వారం రోజులుగా తయారీ నాణ్యత అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉత్పత్తుల సాధనలో శాస్త్రీయత, విశ్లేషణాత్మకత అంశాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా నాణ్యతా ప్రమాణాలు సాధించగలమన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని శిక్షణ పొందిన అధ్యాపకులు మెకానికల్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాంజీ మాట్లాడుతూ నైపుణ్యం విద్యార్థులకు అత్యంత శక్తివంతమైన పరికరమన్నారు. విశాఖ రిఫైనరీ డీజీఎం కేతః శ్రీధర్ మాట్లాడుతూ తయారీలో నాణ్యత నిర్వహణ పరిశ్రమల్లోనే కాకుండా నిజ జీవితంలో కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు ధ్రువపత్రాలు అందించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ ఒ.రామ్మోహనరావు, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, పెందుర్తి పాలిటెక్నిక్ ఓఎస్‌డీ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, మెకానికల్ ఇంజినీరింగు హెడ్ కె.మధుకుమార్, ఇతర విభాగాల హెడ్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్తు ముప్పు నుంచి పిల్లలను మనమే కాపాడుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

సీతమ్మధార: మాదక ద్రవ్యాల వైపు పిల్లలు ఆకర్షితులవకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలలపై లైంగిక దాడులు, మంచి–చెడు స్పర్శల గురించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెల ఏర్పాటుపై డీఈవో చంద్రకళ చొరవ అభినందనీయమన్నారు. ఏయూ సైకాలజీ విభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కంటే పాఠశాలల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నందున, వారి మనసులను అన్ని కోణాల్లోనూ అనుకూలంగా మార్చేలా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఖలీసా బేగం సమన్వయ కర్తగా, ఎంఈవోలు డి.రామారావు, బాలమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వెంకటేశ్వరి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ, పిల్లల మనస్తత్వ నిపుణులు ఎం.సాయి, వంశీ, పార్వతీ కశ్యప్, డీసీపీయూ ప్రతినిధులు కె.శారద, కె.శకుంతల, ఆనంద్, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.మనోజ్, కె.విజయకుమారి, సీఆర్పీలు, వార్డు సచివాలయల కార్యదర్శులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి



ఆరిలోవలో ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది

బీచ్‌రోడ్డు: కోల్‌కతాలో మహిళా ట్రైనీ డాక్టర్‌పై జరిగిన దాడి దారుణమని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆరిలోవ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిత డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరుతూ శనివారం ఆరిలోవ ఆస్పత్రి వద్ద వైద్య సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు పూర్తి స్థాయి భద్రత కల్పించాలని నినాదాలు చేశారు.

కృష్ణాష్టమి వేడుకలకు భారీ సెట్



గాదిరాజు ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సెట్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో వేడుకలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గాదిరాజు ప్యాలెస్‌లో భారీ సెట్‌ను నిర్వాహకులు సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన చిత్రాలను హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ శనివారం విడుదల చేసింది. వేడుకల్లో భాగంగా 108 మంది ప్రసిద్ధ సంగీత కళాకారులచే సామూహిక భజగోవిందం, 108 సార్లు హరి నామ జపం, బాల గోపాలుడికి ఉయ్యాల సేవ, మహా అభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామిని భక్తులు దర్శనం చేసుకోవచ్చన్నారు.

ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్‌గా కంచర్ల



కంచర్ల అచ్యుతరావును సత్కరిస్తున్న ఫెడరేషన్ సభ్యులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ చైర్మన్‌గా డాక్టర్ కంచర్ల అచ్యుతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపకార్ ట్రస్ట్ అధ్యక్షునిగా, సినీ నిర్మాతగా, విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘ అధ్యక్షునిగా కంచర్ల సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల సినీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఏ ప్రాంతంలో షూటింగ్ జరిగితే ఆ ప్రాంత కార్మికులకు అవకాశం కల్పించడానికి, వారి జీవనోపాధికి బాటలు వేస్తానన్నారు. అనంతరం ఆయనను కళాకారులు, పరిశ్రమలో పనిచేస్తున్న వారు ఘనంగా సత్కరించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు కొండపల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శి చవల మురళీకృష్ణ పాల్గొన్నారు.

సరైన నిర్ణయాలతో లక్ష్య సాధన



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న అతిథులు

విశాఖ సిటీ: విద్యార్థులు సరైన నిర్ణయాలు, సమయపాలనతో లక్ష్యాలను సాధించాలని ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు సూచించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, మూమెంట్ 21 స్టూడెంట్స్ ఆధ్వర్యంలో శనివారం ఎడ్యుటైన్మెంట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్, ఎంటర్‌టైన్మెంట్ (3ఈ) అనే అంశంపై ఒకరోజు జాతీయ వర్క్‌షాప్‌ను పీటర్ డక్కర్ స్మార్ట్ సెమినార్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. అనంతరం హెడ్ ఆర్ట్ అండ్ కామర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ జాలాది రవి మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎడ్యుకేషన్, ఎంటర్‌టైన్మెంట్, ఎంప్లాయిమెంట్ అనే మూడు అంశాలు చాలా కీలకమన్నారు. ఈ మూడింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమానికి వర్క్‌షాప్ కో–కన్వీనర్ బోరుగడ్డ సుబ్బయ్య వందన సమర్పణ చేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు, విదేశీ పరిశోధకులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహిస్తుండగా మాలప్పురం, కేరళకు చెందిన అబ్దుల్ మాలిక్, మహ్మద్ ముస్ఫిర్, మహ్మద్ ఫాజిల్ అక్రమంగా గంజాయి రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళకు తరలిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని రూ.88 వేల విలువైన 17.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎస్ఐ ఎస్.కె.అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించారు. ముగ్గురిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిస్త్రీ, సిబ్బంది పాల్గొన్నారు.